తెలంగాణ పసిడి జోరు

ఖేలో ఇండియా యూత్ గేమ్స్

హైదరాబాద్, ఆట ప్రతినిధి: గయా(బీహార్) వేదికగా జరుగుతున్న ప్రతిష్టాత్మక ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌లో తెలంగాణ ప్లేయర్లు పసిడి పతకాలతో అదరగొట్టారు. పోటీలకు రెండో రోజైన మంగళవారం తెలంగాణకు స్విమ్మింగ్‌లో మూడు స్వర్ణాలు సహా సైక్లింగ్‌లో కాంస్యం దక్కింది. పురుషుల 400మీటర్ల వ్యక్తిగత మెడ్లే ఈవెంట్‌లో రాష్ట్ర యువ స్విమ్మర్ వర్షిత్ ధూలిపూడి 4:38:39సెకన్ల టైమింగ్‌తో స్వర్ణం కైవసం చేసుకున్నాడు. పురుషుల 100మీటర్ల బ్యాక్‌స్ట్రోక్ ఈవెంట్‌లో మైలారి సుహాస్‌ప్రీతమ్ 58.73సెకన్ల టైమింగ్‌తో పసిడి దక్కించుకున్నాడు. మహిళల 100మీటర్ల బ్యాక్‌స్ట్రోక్‌లో సాగి శ్రీనిత్య 1:06:36 సెకన్ల టైమింగ్‌తో స్వర్ణం ఖాతాలో వేసుకుంది. 1కి లోమీటర్ ట్రాక్ సైక్లింగ్ ఈవెంట్‌లో సాయిచరణ్ యాదవ్(1:09:56సె) మూడో స్థానంతో కాంస్యం కైవసం చేసుకున్నాడు. మొత్తంగా నాలుగు పతకాలతో తెలంగాణ ప్రస్తుతం నాలుగో స్థానంలో కొనసాగుతున్నది.

ఒత్తిడి భారంతోనే..

కెప్టెన్సీ వదిలేయడంపై కోహ్లీ ఆసక్తికర వ్యాఖ్యలు

బెంగళూరు: ప్రతికూల పరిస్థితుల్లోనూ ఒత్తిడిని చిత్తుచేస్తూ ఎన్నో మరుపురాని ఇన్నింగ్స్‌లు ఆడి భారత జట్టుకు చిరస్మరణీయ విజయాలు అందించిన టీమ్‌ఇండియా మాజీ సారథి విరాట్ కోహ్లీ తాను కెప్టెన్సీ ఎందుకు వదిలేయాల్సి వచ్చిందనే దానిపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. భారత క్రికెట్ జట్టుకు సుమారు ఎనిమిదేండ్లు, ఐపీఎల్‌లో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) ఫ్రాంచైజీకి తొమ్మిదేండ్లు సారథిగా పనిచేసిన తాను ఒత్తిడి వల్లే ఆ బాధ్యతల నుంచి తప్పుకున్నానని వెల్లడించాడు. ఆర్‌సీబీ విడుదల చేసిన 'బోల్డ్ డైరీస్' వీడియోలో కోహ్లీ మాట్లాడుతూ.. 'భారత జట్టుకు సుమారు ఏడేనిమిదేండ్లు, ఆర్‌సీబీకి 9 ఏండ్లు సారథిగా ఉన్నా. నేను ఆడిన ప్రతి మ్యాచ్‌లోనూ నా మీద భారీ అంచనాలుండేవి. నా ఆటతీరు, సారథ్య సామర్థ్యంపై నిత్యం చర్చ జరుగుతూ ఉండేది. బ్యాటింగ్‌లో రాణిస్తే కెప్టెన్సీపై.. నాయకుడిగా సఫలమైతే నా బ్యాటింగ్‌పై.. ఇలా 24X7 నాపై కండ్లుండేవి. అది నాకు చాలా కష్టంగా అనిపించింది. ఒకానొక దశలో నేను తీవ్ర ఒత్తిడికి లోనయ్యాను. నా క్రికెట్ కెరీర్‌పై మరొకరు వేలెత్తి చూపకుండా ఉండాలని, స్వేచ్ఛగా ఆడాలని ఆ సమయంలో నేను నిశ్చయించుకున్నా' అని అన్నాడు.

పాక్‌తో క్రికెట్ ఆడేది లేదు

చీఫ్ కోచ్ గౌతం గంభీర్ స్పష్టీకరణ

న్యూఢిల్లీ: సీమాంతర ఉగ్రవాదం అంతమయ్యే వరకు దాయాది పాకిస్థాన్‌తో భారత్ క్రికెట్ ఆడే ప్రసక్తే లేదని చీఫ్ కోచ్ గౌతం గంభీర్ స్పష్టం చేశాడు. ఆసియాకప్, ఐసీసీ టోర్నీల్లోనూ పాక్‌తో మ్యాచ్‌లు ఆడవద్దని సూచించాడు. ఒక జాతీయ టెలివిజన్‌కు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో గంభీర్ పలు అంశాలపై మాట్లాడాడు. 'పాకిస్థాన్‌తో క్రికెట్ ఆడవద్దనేది నా వ్యక్తిగత అభిప్రాయం. ఉగ్రవాదం అంతమయ్యే వరకు భారత్, పాక్ మధ్య ఎలాంటి మ్యాచ్‌లు జరుగవద్దు. ఈ విషయంలో మేము ఆడాలా వద్దా అనేది కేంద్ర ప్రభుత్వానిదే తుది నిర్ణయం. భారత సైనికులు, పౌరుల ప్రాణాల కంటే క్రికెట్, సినిమాలు పెద్ద ప్రాధాన్యత కాదు. మ్యాచ్‌లు జరుగుతూనే ఉంటాయి, సినిమాలు తీస్తూనే ఉంటారు, సింగర్లు పాటలు పాడుతూనే ఉంటారు. కానీ మన కుటుంబం కోల్పోయిన అప్పుల ప్రాణాల కంటే గొప్ప కాదు కదా?' అని అన్నాడు. ఇదిలా ఉంటే రోహిత్‌శర్మ, విరాట్ కోహ్లీ ఫామ్‌లో ఉన్నంత కాలం జట్టుకు ఆడుతారని గంభీర్ పేర్కొన్నాడు. ఇంగ్లండ్‌తో టెస్టు సిరీస్‌కు ఎంపిక చేసే జట్టులో తన ప్రమేయం లేదని తెలిపాడు.

స్విమ్మింగ్ వరల్డ్ యూనిర్సిటీ పోటీలకు

నవీపేట, మే 6: నిజామాబాద్ జిల్లా నవీపేట మండలం బినోలా గ్రామానికి చెందిన మిట్టపల్లి రిత్విక స్విమ్మింగ్ వరల్డ్ యూనివర్సిటీ పోటీలకు ఎంపికైంది. బెర్లిన్(జర్మనీ) నగరంలో జూలై 16 నుంచి 27 వరకు జరుగనున్న స్విమ్మింగ్ వరల్డ్ యూనివర్సిటీ పోటీల్లో పాల్గొంటుందని తెలంగాణ స్విమ్మింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బెంగళూరులో ఏప్రిల్ 24, 25వ తేదీల్లో స్విమ్మింగ్ పోటీల్లో సత్తా చాటి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు.

ప్రత్యేక ఆకర్షణగా కుర్రాళ్లు

ముంబై: ఈ నెల 26 నుంచి మొదలు కానున్న ప్రతిష్టాత్మక టీ20 ముంబై లీగ్‌లో బుధవారం వేలం ప్రక్రియను నిర్వహించనున్నారు. ఆరేండ్ల విరామం తర్వాత జరుగనున్న ఈ టోర్నీలో ఇప్పటికే ఐపీఎల్‌లో సత్తా చాటుతున్న ముంబై, మహారాష్ట్రకు చెందిన పలువురు యువ క్రికెటర్లు ఈ వేలంలో ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నారు. ఐపీఎల్-18లో చెన్నైకి ఆడుతున్న ఆయుష్ మాత్రెతో పాటు దేశవాళీలో ముంబైకి ఆడే ముషీర్, తనుష్, సిద్ధేశ్ లాడ్, శామ్స్, రఘువంశీ వంటి కుర్రాళ్లను దక్కించుకునేందుకు ఫ్రాంచైజీలు అమితాసక్తి చూపుతున్నాయి.

భారత షట్లర్లకు నిరాశ

తైవాన్: తైపీ ఓపెన్ సూపర్ 300 టోర్నమెంట్‌లో భారత సింగిల్స్ పోరాటం తొలి రౌండ్‌లోనే ముగిసింది. మెయిన్‌డ్రాకు అర్హత సాధించిన పలువురు యువ షట్లర్లు.. తదుపరి రౌండ్‌కు ముందంజ వేయలేక ఇంటిబాట పట్టారు. పురుషుల, మహిళల సింగిల్స్‌లో ఒక్కరంటే ఒక్కరూ ముందంజ వేయలేకపోలేదు. పురుషుల సింగిల్స్‌లో మన్‌రాజ్ సింగ్, రఘు నిరాశపరిచారు.

ముంబైపై ఉత్కంఠ విజయం

ప్లేఆఫ్స్‌లో జీటీ!

రాణించిన గిల్, బట్లర్ • ప్లేఆఫ్స్ రేసులో మరింత ముందంజ

ముంబై: ఈ సీజన్‌లో వరుసగా ఆరు విజయాలతో దూకుడు మీదున్న ముంబై ఇండియన్స్ జోరుకు బ్రేక్ పడింది. అప్రతిహతంగా సాగుతున్న ఆ జట్టు జైత్రయాత్రకు గుజరాత్ టైటాన్స్(జీటీ) కళ్లెం వేసింది. ఈ సీజన్‌లో వరుసగా ఏడో విజయంతో తిరిగి అగ్రస్థానంతో పాటు ప్లేఆఫ్స్ బెర్తునూ ఖాయం చేసుకోవాలన్న లక్ష్యంతో బరిలోకి దిగిన ముంబైని గుజరాత్ ఓడించి షాకిచ్చింది. మంగళవారం రాత్రి వాంఖడే వేదికగా హోరాహోరీగా సాగిన మ్యాచ్‌లో ముంబైపై 3 వికెట్ల తేడాతో(డక్‌వర్త్ లూయిస్) జీటీ ఉత్కంఠ విజయం సాధించింది. మొదట బ్యాటింగ్ చేసిన ముంబై.. ప్రధాన బ్యాటర్ల వైఫల్యంతో నిర్ణీత ఓవర్లలో 155/8కే పరిమితమైంది. విల్ జాక్స్ (35 బంతుల్లో 53, 5 ఫోర్లు, 3 సిక్స్‌లు), సూర్యకుమార్ యాదవ్ (24 బంతుల్లో 35, 5 ఫోర్లు) ఆ జట్టును ఆదుకున్నారు. గుజరాత్ బౌలర్లలో సాయి కిషోర్ (2/34), గెరాల్డ్ కొయెట్జ్ (1/10), అర్షద్ ఖాన్ (1/18), రషీద్ ఖాన్ (1/21), సిరాజ్ (1/29) సమిష్టిగా సత్తాచాటారు. ఆ తర్వాత లక్ష్యఛేదనకు దిగిన గుజరాత్ వర్షం అంతరాయం కల్గించే సమయానికి 19 ఓవర్లలో 147/7 స్కోరు చేసింది. కెప్టెన్ శుభ్‌మన్ గిల్(43), బట్లర్(30) రాణించారు. బుమ్రా (2/19), బౌల్ట్(2/22) ఆకట్టుకున్నారు. వర్షం అంతరాయంతో డకవర్త్ లూయిస్ ప్రకారం గుజరాత్ విజయానికి 6 బంతుల్లో 15 పరుగులు అవసరం కాగా, కొట్జె(12) ఔటైనా..తెవాటియా(11 నాటౌట్), అర్షద్‌ఖాన్(1 నాటౌట్) జట్టుకు చిరస్మరణీయ విజయాన్ని కట్టబెట్టారు.

జీటీ నిలకడగా:

స్వల్ప ఛేదనలో టైటాన్స్‌కూ ఆదిలోనే ఎదురుదెబ్బ తగిలింది. ఈ సీజన్‌లో నిలకడగా రాణిస్తున్న సాయి సుదర్శన్ (5)ను బౌల్ట్ రెండో ఓవర్లోనే ఔట్ చేసి ముంబైకి తొలి బ్రేక్ ఇచ్చాడు. ఐపీఎల్‌లో ఈ తమిళనాడు కుర్రాడు సింగిల్ డిజిట్‌కు వెనుదిరగడం ఇది మూడోసారి మాత్రమే. బుమ్రా, బౌల్ట్ కట్టుదిట్టంగా బంతులేయడంతో టైటాన్స్‌కు పరుగుల రాకే గగనమైంది. పవర్ ప్లేలో గుజరాత్ చేసిన స్కోరు 29/1 మాత్రమే. కానీ 8వ ఓవర్ వేసిన హార్దిక్.. 11 బంతులు (3 వైడ్స్, 2 నోబాల్స్) విసిరి 18 పరుగులు సమర్పించుకోవడంతో టైటాన్స్ మళ్లీ రేసులోకి వచ్చింది. అశ్వని ఓవర్లో గిల్ ఇచ్చిన క్యాచ్‌ను తిలక్ జారవిడిచినా.. మరుసటి బంతికే బ్యాట్ ఎడ్జ్‌కు తాకి రికెల్టన్ చేతిలో పడటంతో అతడు నిష్క్రమించాడు. ఇంప్యాక్ట్ ప్లేయర్‌గా వచ్చిన రూథర్‌ఫర్డ్.. ముంబై బౌలర్లపై ఎదురుదాడికి దిగాడు. జాక్స్ ఓవర్లో 4, 4, 6తో సమీకరణాలు మారిపోయాయి. టైటాన్స్ ఇన్నింగ్స్ ఆరంభం నుంచే బెదిరించిన వర్షం.. 14వ ఓవర్లో జోరందుకుంది. కానీ అప్పటికే డీఎల్ఎస్ కంటే 8 రన్స్ అధికంగా ఉన్న గుజరాత్‌ను రూథర్‌ఫర్డ్ ఆదుకున్నాడు. అయితే వర్షం అంతరాయం తర్వాత గుజరాత్ వరుస విరామాల్లో వికెట్లు కోల్పోయింది. బుమ్రా బౌలింగ్‌లో గిల్ క్లీన్‌బౌల్డ్‌కాగా, రూథర్‌ఫర్డ్‌ను బౌల్ట్ వికెట్ల ముందు దొరకబుచ్చుకున్నాడు. దీంతో రెండు పరుగుల తేడాతో వీరిద్దరు పెవిలియన్ చేరారు. ఆ తర్వాత వచ్చిన షారుఖ్‌ఖాన్(5), రషీద్ ఖాన్(2) వెంటవెంటనే ఔట్ కావడంతో సమీకరణం కాస్తా 12 బంతుల్లో 24 పరుగులకు మారింది. ఈ తరుణంలో మరోమారు భారీ వర్షంతో మ్యాచ్‌కు అంతరాయం కల్గింది.

ఆ ఇద్దరి దూకుడుతో..

గత మ్యాచ్‌లలో ముంబైకి మెరుపు ఆరంభాలను అందించిన ముంబై ఓపెనర్లు రికెల్టన్ (2), రోహిత్ (7) ఆదిలోనే పెవిలియన్‌కు చేరడంతో ఆ జట్టుకు మొదట్లోనే షాకులు తాకాయి. సిరాజ్ రెండో బంతికే రికెల్టన్ ఇచ్చిన క్యాచ్‌ను కవర్స్‌లో సుదర్శన్ అందుకోగా లెఫ్టార్స్ పేసర్లను ఆడటంలో తంటాలుపడే రోహిత్.. మరోసారి అదే బలహీనతను చాటుతూ అర్షద్ నాలుగో ఓవర్లో మిడాఫ్ వద్ద ప్రసిద్ధ్ చేతికి చిక్కాడు. ఎదుర్కున్న రెండో బంతికే సుదర్శన్ క్యాచ్ మిస్ చేయడంతో బతికిపోయిన జాక్స్‌కు సూర్య జతకలవడంతో ముంబై స్కోరువేగం పుంజుకుంది. సిరాజ్ మూడో ఓవర్లో జాక్స్ 6,4 కొట్టగా.. ప్రసిద్ధ్ 5వ ఓవర్లో సూర్య మూడు బౌండరీలు రాబట్టాడు. అర్షద్ ఆరో ఓవర్లో జాక్స్ కూడా మూడు ఫోర్లు బాదాడు. ఈ ద్వయం దూకుడుతో పది ఓవర్లకు ముంబై 89/2తో పటిష్టంగానే నిలిచింది. సాయి కిషోర్ 11వ ఓవర్లో లాంగాఫ్ మీదుగా సిక్స్ కొట్టిన జాక్స్ అర్ధ శతకాన్ని పూర్తిచేశాడు. కానీ ఇదే ఓవర్లో సూర్య.. భారీ షాట్ ఆడబోయి లాంగాఫ్‌లో షారుక్‌కు క్యాచ్ ఇవ్వడంతో 71 పరుగుల మూడో వికెట్ భాగస్వామ్యానికి తెరపడింది. సూర్య నిష్క్రమణతో ముంబై ఇన్నింగ్స్ పేకమేడను తలపించింది. రషీద్.. జాక్స్‌ను బోల్తా కొట్టించగా మరుసటి ఓవర్లో సాయి.. హార్దిక్‌ను ఔట్ చేయడంతో ముంబై ఐదో వికెట్ కోల్పోయింది. బౌలింగ్ మార్పుగా వచ్చిన కొయెట్జ్.. తిలక్ (7)ను పెవిలియన్‌కు పంపాడు. నమన్ (7) సైతం నిరాశపరచగా ఆఖర్లో కార్బిన్ బాష్ (27) మెరుపులతో ముంబై పోరాడగలిగే స్కోరును సాధించింది.

సంక్షిప్త స్కోర్లు

ముంబై: 20 ఓవర్లలో 155/8 (జాక్స్ 53, సూర్య 35, సాయి కిషోర్ 2/34, కొయెట్జ్ 1/10); **గుజరాత్:** 19 ఓవర్లలో 147/7(గిల్ 43, బట్లర్ 30, బుమ్రా 2/19, బౌల్ట్ 2/22)

పాయింట్ల పట్టిక

జ	మ్యా	గె	ఓ	ఫ.తే	పా	ర.రే
గుజరాత్	11	8	3	0	16	0.79
బెంగళూరు	11	8	3	0	16	0.48
పంజాబ్	11	7	3	1	15	0.37
ముంబై	12	7	5	0	14	1.15
ఢిల్లీ	11	6	4	1	13	0.36
కోల్‌కతా	11	5	5	1	11	0.24
లక్నో	11	5	6	0	10	-0.46
హైదరాబాద్ X	11	3	7	1	7	-1.19
రాజస్థాన్ X	12	3	9	0	6	-0.71
చెన్నై X	11	2	9	0	4	-1.11

నోట్: జ- జట్టు, మ్యా. మ్యాచ్, గె-గెలుపు, ఓ-ఓటమి, ఫ.తే-ఫలితం తేలనిది పా-పాయింట్లు, ర.రే-రన్‌రేట్

హెచ్‌సీఏకు షాక్

వెంకటేశ్‌ప్రసాద్ ఇతరుల నియామకాలు రద్దు

వాళ్లకు చెల్లించిన మొత్తాలను హెచ్‌సీఏ నుంచి రాబట్టాలి

హైకోర్టు కీలక ఆదేశాలు

హైదరాబాద్, మే 6 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్(హెచ్‌సీఏ)కు హైకోర్టులో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. క్రికెట్ ఆపరేషన్స్ అండ్ గేమ్ డెవలప్‌మెంట్ కన్సల్టెంట్‌గా భారత మాజీ క్రికెటర్ బీకే వెంకటేష్ ప్రసాద్ సహా కోచ్, సిబ్బంది మొత్తం పది మందిని నియమించడాన్ని తప్పుపట్టింది. ఆ పది మంది నియామకాలను పక్కన బెడుతూ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నగేశ్ భీమపాక ఇటీవల కీలక ఉత్తర్వులు జారీ చేశారు. బాపు కృష్ణరావు (బీకే) వెంకటేష్ ప్రసాద్, హిమానీ యాదవ్, మమతా కనోజియా, అర్జున్ హయసల, సబ్యసాచి, రాజశేఖర్ ఖన్నాల్, హైదరాబాద్ రంజీ కోచ్ వినీత్ సక్సేనా, శ్రవంతి నాయుడు, బీఆర్ సువర్ణ లక్ష్మి, ఎస్ఎన్ అమిత్ .. ఈ పది మందిని హెచ్‌సీఏ యాక్ట్ రూల్స్‌కు వ్యతిరేకంగా నియామకాలు చేశారని దాఖలైన పిటిషన్‌పై తీర్పు వెలువరించారు. వాళ్ల నియామకాలను సవాలు చేస్తూ హెచ్‌సీఏ ఉపాధ్యక్షుడు సర్దార్ దల్జీత్ సింగ్, జాయింట్ సెక్రటరీ బసవరాజు, కౌన్సిలర్ సునీల్ అగర్వాల్, అపెక్స్ కౌన్సిల్ పురుషుల విభాగ ప్రతినిధి రంగపథ్ అర్జున్ స్వరూప్, మహిళా విభాగ ప్రతినిధి వంకా రోమాసింగ్ పిటిషన్ దాఖలు చేశారు. హెచ్‌సీఏ ఆఫీస్ బేరర్లు నలుగురు కలిసి గత ఏడాది ఆగస్టు 30న అపెక్స్ కౌన్సిల్ ఆమోదం లేకుండా వెంకటేష్ ప్రసాద్ ఇతరులతో ఒప్పందం చేసుకోవడాన్ని న్యాయమూర్తి తప్పుపట్టారు. ఏడాదికి రూ.75 లక్షల వేతనంతో క్రికెట్ కార్యకలాపాలకు కన్సల్టెంట్‌గా నియమించడాన్ని పక్కనబెట్టారు. ఇప్పటి వరకు ఆ పది మందికి చెల్లించిన మొత్తాన్ని, నిబంధనలకు వ్యతిరేకంగా నియమించిన హెచ్‌సీఏ అధ్యక్షుడు, కార్యదర్శి, కోశాధికారి, సీఈవోల వ్యక్తిగత బ్యాంక్ ఖాతాల నుంచి రికవరీ చేయాలని తీర్పులో పేర్కొన్నారు. ఈ మేరకు హెచ్‌సీఏను ఆదేశించారు. హైదరాబాద్ క్రికెట్ అకాడమీ ఆఫ్ ఎక్సలెన్స్ (హెచ్‌సీఏఈ) కోచ్‌లు, డైరెక్టర్‌తో కూడిన క్రికెట్ కోచింగ్ అకాడమీని హెచ్‌సీఏ పక్కనబెట్టి పది మందిని నియామకాలు చేశారనే పిటిషనర్ల వాదనను ఆమోదించారు.

నిర్మాత కష్టాలేమిటో తెలిసొచ్చాయి!

'నటిగా 15 ఏళ్ల కెరీర్ పూర్తయింది. ఈ ప్రయాణంలో ఎంతో మంది అభిమానాన్ని సంపాదించుకున్నా. అయినా ఇంకా ఏదో చేయాలనే తపన నన్ను వెంటాడేది. ఇండస్ట్రీలో ఇంత అనుభవం ఉంది కాదా అనే ధీమాతో నిర్మాతగా మారాను' అని చెప్పారు అగ్ర కథానాయిక సమంత. ట్రా లా లా పేరుతో నూతన నిర్మాణ సంస్థను ప్రారంభించిన ఆమె తొలి ప్రయత్నంగా తెరకెక్కించిన 'శుభం' చిత్రం ఈ నెల 9న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సందర్భంగా మంగళవారం సమంత పాత్రికేయులతో ముచ్చటిస్తూ పంచుకున్న విశేషాలు...

- నటిగా శుక్రవారం ఎలా ఉంటుందో నాకు అనుభవం ఉంది. కానీ నిర్మాతగా నాకిది మొదటి శుక్రవారం. చాలా ఒత్తిడిగా ఫీలవుతున్నా. నిర్మాతకు ఎన్ని కష్టాలు ఉంటాయో ఇప్పుడు నాకు అర్థమవుతున్నది. వారం రోజులుగా నిద్రలేని రాత్రులు గడుపుతున్నా. లొకేషన్‌లో ఒక్క సీన్ అనుకున్నట్లుగా రాకపోతే నిర్మాతకు ఎంత నష్టం వస్తుంది? ఎంత డబ్బు వృథా అవుతుందో ఇప్పుడు ప్రత్యక్షంగా తెలుసుకున్నా.
- ఈ సినిమా కథ సీరియల్స్ చుట్టూ నడుస్తుంది. సీరియల్స్‌లో శుభం కార్డు ఎప్పుడు పడుతుందా అని అందరూ ఎదురుచూస్తుంటారు. అందుకే అదే టైటిల్ పెట్టాం. ఇక ప్రొడక్షన్ హౌస్‌కు ట్రా లా లా అనే పేరు పెట్టడానికి ఓ కారణం ఉంది. చిన్నప్పుడు స్కూల్లో 'బ్రౌన్ గర్ల్ ఇన్ ది రెయిన్' అనే ఓ పోయెమ్ ఉండేది. అందులోని వాక్యాల్ని తీసుకొని బ్యానర్ పేరు పెట్టాను.
- నాకు నేనే పెద్ద విమర్శకురాలిని. సినిమా విషయంలో ఎక్కడ తప్పు చేశానో వెంటనే తెలిసిపోతుంది. 'శుభం' విషయంలో అలాంటి తప్పులు జరగకూడదని అనుకున్నా. ఫస్ట్‌సీన్ నుంచి లాస్ట్ సీన్ వరకు ఎక్కడా బోర్ కొట్టకుండా ఉండేలా జాగ్రత్తలు తీసుకున్నాం. ఇది హారర్ కామెడీ చిత్రం. ఇందులో సోషల్ సెటైర్ కూడా ఉంటుంది.
- ఈ మధ్య ఓ అభిమాని నాకోసం గుడి కట్టారని తెలిసింది. నా మీద ఇంత ప్రేమ చూపిస్తున్నారా? అనుకున్నా. ఏం చెప్పాలో కూడా తెలియలేదు. కానీ ఇలా గుడులు కట్టే ధోరణిని మాత్రం నేను ప్రోత్సహించను. 'శుభం' చిత్రానికి మంచి రిలీజ్ డేట్ దొరికింది. ఈ వేసవిలో అందరూ ఫ్యామిలీతో కలిసి సినిమా చూడాలని కోరుకుంటున్నా.

అనాటి 'కాంత'

దుల్కర్ సల్మాన్, భాగ్యశ్రీ బోర్సే జంటగా నటిస్తున్న పీరియాడిక్ చిత్రం 'కాంత'. సెల్వమణి సెల్వరాజ్ దర్శకుడు. 1950 మద్రాస్ నేపథ్య కథాంశంతో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. మంగళవారం కథానాయిక భాగ్యశ్రీ బోర్సే పుట్టిన రోజు సందర్భంగా కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు. 1950ల నాటి క్లాసిక్ రెట్రో లుక్‌తో పోస్టర్ ఆకట్టుకుంటున్నది. వినూత్నమైన పీరియాడిక్ కథాంశమిదని, నాటి ప్రజల జీవితానికి అద్దం పడుతుందని, భాగ్యశ్రీ బోర్సే పాత్ర కథా గమనంలో కీలకంగా ఉంటుందని చిత్రబృందం పేర్కొంది. త్వరలో విడుదల తేదీని ప్రకటిస్తామని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి సంగీతం: ఝను చంతర్, నిర్మాతలు: రానా దగ్గుబాటి, దుల్కర్ సల్మాన్, ప్రశాంత్ పొట్లూరి, జోమ్ వర్గీస్, దర్శకత్వం: సెల్వమణి సెల్వరాజ్.

సింగిల్‌గానే ఉన్నా!

'కెరీర్ విషయంలో చాలా సంతోషంగా ఉన్నా. జయాపజయాలు మన చేతిలో ఉండవు. ప్రయత్నించడం వరకే మన పని. ఫలితంతో సంబంధం లేకుండా వృత్తిని ప్రేమిస్తూ ముందుకు వెళ్తున్నా' అని చెప్పింది కథానాయిక కేతిక శర్మ. ఈ భామ శ్రీవిష్ణుతో కలిసి నటించిన తాజా చిత్రం 'సింగిల్' ఈ నెల 9న విడుదలకానుంది. గీతా ఆర్ట్స్ నిర్మించిన ఈ చిత్రానికి కార్తీక్‌రాజు దర్శకుడు. ఈ సందర్భంగా మంగళవారం కేతిక శర్మ విలేకరులతో ముచ్చటించింది. ఈ సినిమాలో తాను పూర్వ అనే అమ్మాయి పాత్రలో కనిపిస్తానని, తను ప్రాక్టికల్‌గా ఆలోచించే స్వతంత్ర భావాలు గల యువతి అని చెప్పింది. ఆద్యంతం చక్కటి వినోదంతో సాగే ముక్కోణపు ప్రేమకథా చిత్రమిదని, హృదయాన్ని తాకే ఎమోషన్స్ కూడా ఉంటాయని తెలిపింది. శ్రీవిష్ణుతో పనిచేయడం హ్యాపీగా ఉందని, తన కామెడీ టైమింగ్ చాలా స్పెషల్ అని కేతిక శర్మ పేర్కొంది. డ్రీమ్ రోల్ గురించి చెబుతూ 'రష్మిక మందన్న ప్రస్తుతం గీతా ఆర్ట్స్‌లో 'గర్ల్ ఫ్రెండ్' సినిమా చేస్తున్నది. అందులో ఆమెది అద్భుతమైన పాత్ర. ఆ తరహా క్యారెక్టర్ చేయాలన్నది నా డ్రీమ్. సాయిపల్లవి, కీర్తి సురేష్ మాదిరిగా పర్‌ఫార్మెన్స్ స్కోప్ ఉన్న రోల్స్ కోసం ఎదురుచూస్తున్నా' అని చెప్పింది. తన రిలేషన్‌షిప్ స్టేటస్ గురించి మాట్లాడుతూ 'ప్రస్తుతానికైతే సింగిలే. మనసుకు నచ్చిన వారు తారసపడితే ప్రేమలో పడతానేమో? ఇప్పుడు నా దృష్టంతా కెరీర్ మీదే ఉంది' అని చెప్పుకొచ్చింది.

వింటేజ్ ఇళయరాజా మ్యాజిక్

చిత్రం

రాజేంద్రప్రసాద్, అర్చన ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'షష్టి పూర్తి'. పవన్‌ప్రభ దర్శకుడు. రూపేష్, ఆకాంక్ష సింగ్ నాయకానాయికలుగా నటించారు. మా ఆయి ప్రొడక్షన్స్ పతాకంపై రూపేష్ నిర్మించారు. ఈ సినిమాను ఈ నెల 30న విడుదల చేయబోతున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ఎన్నో ప్రత్యేకతల సమాహారంగా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నామని, 'లే డీస్ టైలర్' విడుదలైన 38 ఏళ్ల తర్వాత రాజేంద్రప్రసాద్, అర్చన కలిసి నటించడం, ఆస్కార్ గ్రహీత ఎం.ఎం.కీరవాణి తొలిసారి మేస్ట్రో ఇళయరాజా స్వర సారథ్యంలో పాట పాడటం సినిమాకు ప్రధానాకర్షణలుగా నిలిచాయని దర్శకుడు తెలిపారు. ఇప్పటికే విడుదల చేసిన రెండు పాటలకు శ్రోతల నుంచి అద్భుతమైన స్పందన లభిస్తున్నదని, వింటేజ్ ఇళయరాజా మ్యూజిక్ విన్న ఫీల్ ఉందనే ప్రశంసలొస్తున్నాయని నిర్మాత తెలిపారు. ఈ చిత్రానికి కెమెరా: రామ్, సంగీతం: మాస్ట్రో ఇళయరాజా, స్క్రీన్‌ప్లే, సంభాషణలు: పవన్‌ప్రభ.

టారిఫ్ అమలైతే.. 100% నష్టమే!

విదేశీ చిత్ర నిర్మాణాలపై వందశాతం సుంకం విధిస్తూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తీసుకున్న నిర్ణయం ప్రపంచ వినోద రంగాన్ని ఒక్కసారిగా ఉలిక్కిపడేలా చేసింది. సమకాలీన భారతీయ సినిమాకు అమెరికా కీలకమైన ఆదాయ వనరుగా ఉంది. మొత్తం గ్రాస్ వసూళ్లలో అక్కడి నుంచి ముప్పైశాతం వరకు లభిస్తుండటంతో ట్రంప్ నిర్ణయంపై ఇండియన్ ఎంటర్‌టైన్‌మెంట్ ఇండస్ట్రీలో సర్వత్రా విమర్శలు వెల్లువెత్తాయి. ఇక హాలీవుడ్ ఇండస్ట్రీ సైతం ట్రంప్ నిర్ణయంపై తీవ్రంగా స్పందిస్తున్నది. అయితే వందశాతం టారిఫ్ తాలూకు విధివిధానాలు ఖరారైన తర్వాతే ఈ సుంకాల పోటు ప్రభావం ఎంతవరకు ఉంటుందనే విషయంలో స్పష్టత వస్తుందని ట్రేడ్ వర్గాలు అంటున్నాయి.

ట్రంప్ నిర్ణయం వెనక..

వందశాతం టారిఫ్ విధానంతో అమెరికా సినీ రంగానికి నూతన జవసత్వాలు సమకూర్చాలని, విదేశీ ప్రోత్సాహకాలకు ఆకర్షితులై అక్కడ నిర్మాణానికి మక్కువ చూపిస్తున్న టాప్ ప్రొడక్షన్ కంపెనీలను దారికి తెచ్చుకోవాలనే ఏకైక అజెండాతో ట్రంప్ ఈ నిర్ణయాన్ని తీసుకున్నారని హాలీవుడ్ ఇన్‌సైడ్ టాక్. అమెరికాలో ఫిల్మ్ ప్రొడక్షన్ కాస్ట్ చాలా ఎక్కువ. మానవ వనరుల కొరత కూడా ఉంది. ఈ కారణాలతో అగ్ర నిర్మాణ సంస్థలన్నీ కెనడా, బ్రిటన్, బల్గేరియా, న్యూజిలాండ్, ఆస్ట్రేలియాలో షూటింగ్స్‌కు ప్రాధాన్యతనిస్తున్నాయి. అక్కడి ప్రభుత్వ ప్రోత్సాహకాలు కూడా ఆకర్షణీయంగా ఉన్నాయి. అయితే విదేశాల్లో షూటింగ్స్ జరపడం వల్ల అమెరికాలో సినీ ఔత్సాహికులు, కార్మికులకు ఉపాధి తగ్గిపోతుందన్నది ట్రంప్ వాదన. బయటి దేశాలకు షూటింగ్స్ కోసం పన్నులు చెల్లిస్తూ అమెరికా నుంచి వసూళ్లు రాబట్టుకుంటున్నారని ఆయన ఆగ్రహంగా ఉన్నారు. అయితే వందశాతం టారిఫ్ అమలుకు కొన్ని సృజనాత్మకమైన అంశాలు కూడా ప్రతిబంధకంగా నిలిచే అవకాశాలున్నాయని చెబుతున్నారు.

**సృజనాత్మకతపై గొడ్డలి పెట్ట